# ది లాస్ట్ కేస్

ఉత్తరాల మీద అడ్రెసులు చూస్తున్న డాక్టర్ కరుణ ఓ కవరు బొత్తిలోంచి వేరుచేసి, వెంటనే చింపి చదువుకుని, వెంటనే ఆస్పత్రికి ఫోన్ చేశాడు. "హలో, కరుణారావ్ హియర్ ... గెట్ మి ది సర్జికల్ వార్డ్ ప్లీజ్! అస్క్ ది స్టాఫ్ టు కాల్ మీ ... థ్యాంక్యూ."

ఉత్తరం మళ్లీ చదువుకున్నాడు.

విశ్వనాథరావు తన బాల్యమిత్రుడు. ఇద్దరూ కలసి చదువుకున్నారు. హాస్టల్ మేట్స్. విస్సు తండ్రికి తానింకా హౌస్ సర్జన్‌గా ఉండే రోజుల్లోనే మొదటిసారి ఏంజైనా స్ట్రోక్ రావడం మూలాన కొడుకు ఎంత వేగం చేతి కంది ప్రాక్టీసు అందుకుంటాడా అన్న ఆతృత రావడం, విశ్వనాథరావు రిజిస్ట్రేషన్ వచ్చిన మూడు నెలల్లోనే ఆయన స్వర్గస్థుడవడం—వీటివల్ల ఇంటి వద్దనే ఉండి తండ్రి లోటును భర్తీచేసాడు విశ్వనాథరావు. అవకాశం వచ్చినప్పుడల్లా వస్తూనే ఉంటాడు విశాఖ పట్నం. కాని, అవకాశాలు రావడమే అరుదు. విస్సుకి ఊపిరి పీల్చుకోవడానికి వీలు చిక్కనంత పని చేతినిండా ఉంటుంది. మున్నూట అరవై ఐదు రోజులూ. చుట్టు పక్కల పాతిక ముప్ఫై గ్రామాలలోనూ మంచి హస్తవాసి ఉన్నదని పేరుపడ్డ డాక్టరేమో, రాత్రి పగలూ తీరిక ఉండదు.

కరుణ ఎమ్.ఎస్.లో బంగారు పతకం పొందాడు. సర్జరీ శాఖలో అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగంలోనే స్థిరపడి పోయాడు. తనకూ తీరిక చిక్కడం కష్టమే. ఆస్పత్రి వేళల్లో ఆస్పత్రి, మిగిలిన వేళల్లో ప్రైవేట్ క్లినిక్. ఇవికాక అమెరికన్ ఆస్పత్రిలో స్పెషల్‌గా తననే పిలిపించుకుని చేయించుకునే ఆపరేషన్లు. విస్సూ, కరుణా - వీరి స్నేహం అరమరికలు లేనిది. విస్సుకు ఎప్పుడైనా అవసరమైతే కాల్ చేసి కరుణను సలహా అడగడం, రోగిని అవసరమైతే విశాఖ పంపిస్తూ ఉండడం పరిపాటి. నెలకు రెండు మూడు కేసులైనా రిఫర్ చేస్తుంటాడు విస్సు. చదువుకునే రోజుల నుండీ విస్సుకి ఓ అలవాటుంది. నీలి కవర్లూ, నీలిరంగు లెటర్

హెడ్నూ ఉపయోగించేవాడు పెర్సనల్ కరెస్పాండెన్స్ అంతటకీ. బొత్తెడు ఉత్తరాల లోంచి విస్సు వ్రాసిన ఉత్తరాన్ని ఇట్టే తీయగల కరుణ రోజూ పోస్ట్ రాగానే నీలి కవరు కోసం చూస్తూ ఉండడం పరిపాటి.

టెలిఫోన్ మోగింది

"కరుణారావ్ స్పీకింగ్ ... థర్స్‌డే? ఐయాంసారీ ... ఫిక్స్ ఇట్ ఆన్ సమ్ అదర్ డే ... నోనో ... అవుట్ ఆఫ్ ది క్వశ్చన్ ... సారీ!" అంతా వీడి ఇష్టమే నేమో, తను అడిగినంత ఫీజు ఇచ్చినంత మాత్రాన అర్జెంటు అయినా, కాకపోయినా ఆపరేషన్ చేసెయ్యాలిట!

నాన్సెన్స్! డాక్టర్లకీ సరదాలుంటాయనీ, కాసేపు తీరికగా కూర్చుని కబుర్లు చెప్పుకోవాలని ఉంటుందనీ ధనవంతు లెందుకనుకోరు? ఇంతకీ ఆ హెర్నియా ఆరోజే చెయ్యక పోతేనేం? మరోరోజు చెయ్యవచ్చుగా! బరువుగా నిట్టూర్చాడు కరుణ.

స్వింగ్ డోర్ తెరుచుకుని కాంపౌండరు వెంకటరమణ వచ్చాడు.

"చీట్లు ఇవ్వడం అయిపోయింది, సార్! పదిహేడు ఇచ్చాను." టేబిల్ మీద నోట్లు పెడుతూ అడిగాడు. "మొదటి నంబరు పిలువనా?"

"వెయిట్, ఒక్క అయిదు నిమిషాలు."

బల్ల మీద ఫోన్ మోగింది. ముందుకు వంగి అందుకున్నాడు.

"ఎస్, స్పీకింగ్ ... లుక్ అప్ మై షెడ్యూల్ ఫర్ థర్స్‌డే ... ఐనో ... ఇట్ ఈజ్ మై థియేటర్ డే ... వాట్, ఫోర్! .. నాకు ఆ రోజు చాలా పనుంది. అందుకనే ముందే చెబుతున్నాను. ... అర్జెంటు. అందులో ఉంటే రంగనాధన్ని చేసెయ్యమనండి. ఈజ్ హి దేర్? ప్లీజ్ కాల్ హిమ్ ... హలో, రంగనాధన్! ఐ వోంట్ కమ్ ఆన్ థర్స్‌డే... దీని అర్జంట్ వన్స్ యువర్ సెల్ఫ ప్రైవేట్ ... థాంక్యూ!"

ఫోన్ టింగ్ మనగానే వెంకటరమణ మళ్లీ వచ్చాడు.

"సార్!"

"గెటవుట్ ఐసే ... అలా హడావుడి పడితే, ఆ డబ్బు ఎవరిది వాళ్లకిచ్చి పొమ్మను. ఐదు నిమిషాలు ఆగమన్నానుగా నాకు కొంచెం పనుంది."

ఫోన్ తీసి డయల్ చేసాడు.

"హలో సూర్యనారాయణగారున్నారా? కరుణాకర్రావ్ అని చెప్పండి ఐ విల్ వెయిట్. థాంక్స్."

స్నానం కూడా మెథాడికల్‌గా చేస్తున్నాడేమో గ్రేట్ మాన్. చదువుకునే రోజుల్లో జి.ఎమ్.ను గురించి జోకులేసుకుంటూ ఉండేవారు – నిష్కర్షగా నోట్లో ముద్దని 32 సార్లు నమిలితే కాని మింగడని – స్నానాల గదిలో నీళ్లు పోసుకుంటూ, ఎక్సైనిలా తోముకునే పద్ధతికి కూడా నియమం పెట్టుకున్నాడేమో, ఛాందసుడు!

జి.ఎమ్. గొంతు తీగ మీద నుండి వస్తుందని నిరీక్షిస్తుండగా, చటుక్కున తట్టింది. జి,ఎమ్.ను గురించి తను నవ్వుకున్నట్లే తను గురించి ఇటు వెంకటరమణా, అటు పేషెంట్లు నవ్వుకుంటున్నారేమో!?

వెంకటరమణ ఆత్రంగా స్వింగ్ డోర్స్ మీద నుంచి చూస్తున్నాడు.

"వెంకటరమణా! ఒకటవ నంబర్ పిలువ్!"

"ఎస్సార్ ... వెళ్లండి ... వెళ్లు పాపా!"

"నమస్కారం, డాక్టరుగారూ!" ఓ పదేళ్ల అమ్మాయిని తీసుకొచ్చాడు ఒకాయన.

"నమస్కారం కూచోండి. కూర్చో, అమ్మా... చెప్పండి" ఏదో చెబుతున్నాడు వచ్చినాయన.

"ఎక్కడమ్మా నొప్పి? ఏదీ? ఇలారా, ఇక్కడా? ఎన్నాళ్లయింది జ్వరం ... డాక్టరుగారు పంపారా? ఏదీ ఉత్తరం?"

చెంపదెబ్బ తగిలినట్టు తుళ్ళి పడ్డాడు కరుణ.

"పిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ ఏమైపోతున్నాయ్! టెలిఫోన్ చేత్తో పట్టుకునే కన్సల్టేషన్ చేస్తున్నావన్నమాట ... ఎబ్సర్డ్. నీ డిగ్రీ కాన్సెల్ చెయ్యాలి న్యాయంగా."

బొంగురు గొంతు.

డిగ్రీ కాన్సెల్ అనే మాటలు వినే వరకూ ఫోన్ తన చెవి దగ్గరే ఉందని గుర్తు రాలేదు. "అయాం సారీ, ప్రొఫెసర్! మీరు స్నానం చేస్తున్నారంటే, వెయిట్ చేస్తున్నాను. ఈలోగా ఈ కేసు ... "

"దట్సాల్ రైట్ .. ఏమిటి విశేషం?"

"మా ఫ్రెండ్ విస్సుగాడు ... "

"అవును. విశ్వనాథరావు. 1952 బాచి. మీ క్లాస్ మేట్ ... ఆపార్ట్ కేస్ కొలైటిస్‌ను అపెండిసైటిస్ అన్నాడుగా. జ్ఞాపకముంది. ఏమయింది?"

"మిమ్మల్ని ఓమారు చూడాలని ఉందిట. రేపు లక్ష్మీవారం వస్తున్నానని రాశాడు. లక్ష్మీవారం నాథియేటర్ డే ... కాని, అన్నీ కాన్సిల్ చేసాను."

"బాగుంది. మరో తరం, మరో మనుషులు ... నా రోజుల్లో అయితే మా ఛీఫ్ స్ట్రాంగ్‌గా ఓడోస్ ఇచ్చేసేవాడు. లక్ష్మీవారం అన్నావు కదూ? యు ఆర్ లక్కీ. వెల్‌కమ్, డోన్ట్ మిస్ థర్స్ డే."

ఫోన్‌లో గొంతు వూడి పోయింది.

ఫోన్ పెట్టేసిన తరువాత కాని ఆ విషయం తట్టనే లేదు కరుణకి. ఈ పాతికేళ్లలోనూ ఆయనలో ఏం మార్పు రాలేదు. తను ఫైనల్ ఇయర్‌లో ఉన్నా ఎలా కరిచేసేవాడో ఇప్పుడూ అంతే!

"సారీ! మళ్లీ చెప్పండి .. జ్వరం ఎన్ని రోజుల నుండి వస్తోందీ?" డాక్టర్ పంపిన ఉత్తరం అందుకుంటూ అడిగాడు.

* * * * *

"ఏం రోయ్, అంతా కులాసా? రత్నం ఎలా ఉంది?" హుషారుగా పలకరిస్తున్న కరుణ మిత్రుని ముఖం చూసి జవాబు కోసం ఎదురు చూడడం మానేశాడు.

"ఏమిరా, ఏమయిందీ, అలా ఉన్నావ్!"

"మేడ మీదకు పద. చెబుతా!"

"అమ్మాయ్! అంకుల్ వచ్చాడు కాఫీ తీసుకురా! కార్లో వచ్చావా?"

"లేదురా – డ్రైవింగ్ మానేశా. ఆరు నెల్లయింది."

ఇద్దరూ మేడ మీద కెళ్లారు. మిత్రుల మధ్య అస్వాభావికమైన నిశ్శబ్దం ఏర్పడింది. కరుణ కూతురు నీరజ కాఫీ తీసుకుని వచ్చింది.

"గుడ్ మార్నింగ్, నీరజా! ఎంత పెద్దదాని వయ్యావ్! ఏం చదువు తున్నావ్?" విస్సు నీరజని చూసి కొంచెం మొహం మీద చిరునవ్వు పులుము కున్నాడు. కాఫీ కప్పు తీసుకుని నీరజ కిందకు వెళ్ళి పోయింది.

"చాలా రోజులకి వచ్చావ్. అసలు మనం తీరకగా కూర్చుని మాట్లాడుకుని ఎన్నాళ్లయింది? రత్నాన్ని కూడా తీసుకురాక పోయావా?"

నిట్టూర్చాడు విశ్వనాధరావు.

"అబ్బాయ్! నా ఆరోగ్యం బాగుండడం లేదు, నీ దగ్గర దాచడం అవివేకం. ఇన్నాళ్లు ఎవరికీ తెలియకుండా దాచిపెడుతూ వచ్చాను. నా బి.పి. ఎంతుందో తెలుసా? బ్లడ్ షుగర్, డయాబెటిస్ అన్నీ ఉన్నాయి. నాకు చేతనయిన జాగ్రత్తలన్నీ తీసుకుంటూనే ఉన్నాను. పెద్దవాడి సి.ఎ. పూర్తి కావచ్చింది. చిన్నవాడు సెకెండ్ ఇంటర్లోకి వచ్చాడు. కనీసం వాడు డాక్టరవడమేనా చూస్తానా అన్న అనుమానం. మన జిమ్. దగ్గర కొచ్చి ఎగ్జామిన్ చేయించుకోవాలనిపించింది. ఎందుకో. వెంటనే నీకు ఉత్తరం రాశాను. నీ పెద్యాలంతా వెనక్కి పెట్టుకుని ఉంటావ్.

అన్నట్టు, జి.ఎమ్.కి చెప్పావా? ముందుగా చెప్పకుండా పెట్టకుండా ఊడి పడితే విరుచుకు పడతాడేమో!"

"ఆయన్ని చూడ్డానికేం! చూద్దాం. నువ్వొస్తున్నావని చెప్పాను. నీ ఉత్తరం రాగానే. కానీ, మరో మాట ఆలోచించు. ఎమ్. డి. కార్డియాలజీ, కార్డిఫ్ నుండి మొన్ననే వచ్చాడు నా ఫ్రెండొకడు. అతని దగ్గరకు వెళితే పోలే? వెంటనే ఇసిజి, ఏంజియోగ్రామ్ స్వయంగా తీసి చూసేస్తాడు. పాథాలజీలో కొండిగాడున్నాడు. సెరాలజిస్టూ మనవాడే. ఇన్వెస్టిగేషన్స్ అన్నీ ఇట్టే అయిపోతాయి. తరువాత వెళ్లచ్చుగా జి. ఎమ్. దగ్గరకి?"

"కాదురా! అవన్నీ నాకు తెలుసు కాని, జి. ఎమ్. దగ్గరకు వెళ్లాలని ఉంది ఓ సారి ..."

"ఏం, చీవాట్లు తినాలని ఉందా? మంచి ఫైలూ, పలుకుబడీ ఉన్న జి.పి.ఐ. కదా! నేల విడిచి సాము చేసినట్టు ఆరోగ్యం ఎందుకు అశ్రద్ధ చేసావని విరుచుకు పడితే!" అదే అదననుకుని మూడు రోజుల కిందట టెలిఫోన్‌లో తనకు తగిలిన చీవాట్లను గురించి చెప్పాడు కరుణ.

"నువ్వేమంటే అను. చీవాట్లు చీవాట్లే కాని, జి. ఎమ్. కి ఓ అద్భుతమైన స్టైల్ ఉంది. అంత కన్నా ముఖ్యం - మనని నైతికంగా ఠకాయించే హక్కు నిజంగా అతనికి ఉందేమో అనిపిస్తూ ఉంటుంది."

"ఒరేయ్, నువ్వూరికే హడలి పోతున్నావేమో? నా అనుమానం అదే. పోనీ, వెళదాం. ఆ రోజు నవ్వుకు చచ్చాం - రామనాథం గాడి జోకు జ్ఞాపకం ఉందా?"

"ఏమిటది?"

"బాస్ గొప్ప ఛాందసుడురా, బాబూ. అందుకేరా ఒకే అమ్మాయి కుక్క పిల్లలా గుంటుంది అన్నాడు."

"ఏడిశావ్, వెధవాయ్ వీడూ వీడి ముసలి సామెతలూను .. ఆ అమ్మాయి ఎక్కడుంది?"

"న్యూయార్క్‌లో జి.ఎమ్. అల్లుడు ఆఫ్తాల్మాలజీ ఎక్స్‌పర్టట."

"లక్కీమాన్."

"బయలు దేరుదామా? అన్నట్లు చెప్పడం మరచిపోయాను విస్సుగాడు అనేసరికి నిన్ను పోల్చేసుకున్నాడు. ఎలాగో తెలుసా! ఫైనల్లో షార్ట్ కేస్ మడిల్ చేశావు, జ్ఞాపకం ఉందా? అపెండిసైటిస్ అన్నావ్. జి ఎమ్.కి ఇంకా జ్ఞాపకం ఉంది."

"వెరీ లైక్ హిమ్. ఎప్పటికీ మరచి పోడు. వెళ్లినప్పుడల్లా దెప్పి పొడుస్తూ ఉంటాడు. కాని, హి హేజ్ ఎ హార్ట్ ఆఫ్ గోల్డ్. నో డౌట్ ఎబౌట్ ఇట్."

"అఫ్ కోర్స్. ఆరోజు నీమీద ఇరిటేట్ అయిన ధోరణి చూస్తే అసలు నీ పరీక్ష చెట్టెక్కించేస్తాడనుకున్నాను జ్ఞాపకం ఉందా ఎలా అరిచాడో? ... మెడికల్ వార్డ్‌లో ఇంటర్న్స్‌గా ఉంటున్నాం ఇద్దరం.. శబ్దం చేసే జోళ్లంటే ఆయనకు మహా చిరాకు. ఆ రోజు లెదర్ సోల్ షూస్ వేసుకుని ఆలస్యంగా కూడా వచ్చావ్. బాస్ అప్పటికే రౌండ్స్‌లో ఉన్నాడు. పేషెంట్లు ఎదుటగానే గర్జించెయ్యలేదూ! ప్రిజుడిస్ అయి ప్రాక్టికల్ సున్నా పెట్టేస్తాడనుకున్నా."

"దాని మాటకేం? మనిషికి కోపం ఎంతుందో, అపేక్ష వచ్చినా అంతే. అతని కోపం తాటాకు మంట. అంతెందుకు, ఆ అవధాని లేడూ? ఆ రోజుల్లోనీ ఎనిమీ అవధాని - జ్ఞాపకం ఉందా? జనరల్ మెడిసన్ క్లాస్‌లో గుర్రుపెడుతున్నాడు. ప్రొఫెసర్ క్లాసుకు రావడం లేదనీ, ట్యూటర్ అటెండెన్స్ తీసుకుంటాడనీ చెప్పారెవరో. కక్కుర్తి వెధవ, రూమ్‌కి పోకూడదూ వెనకాల బెంచీ మీద తల పెట్టుకుని నిద్రపోయాడు.

"వరుసగా మూడు రాత్రిల నుండీ గానాబజానా, సినిమాలు. రోజుకి ఏభై సిగరెట్లు తగలేశాడు.

"అటెండెన్స్ వెయ్యడానికి ట్యూటర్ రాకముందే ప్రొఫెసర్ వచ్చి లెక్చర్ ప్రారంభించాడు. నువ్వు ఆరోజు మామూలు ధోరణిలో నాచేత అటెండెన్స్ పలికించుకునే పద్ధతిలో వెళ్ళిపోయావ్. ట్యూటర్ కంట్లో కారం కొట్టడం ఎంత పని! అలా అలా ప్రొఫెసర్ ఫ్రీ ఫీలింగ్ లో పడి ప్రొఫెషనల్ ఎథిక్స్ మీద లెక్చర్ దంచేస్తున్నాడు."

"క్లియర్ గా వినబడుతోంది, ప్రొఫెసర్ లెక్చర్ కంటె కొంచెం ఎక్కువ స్థాయిలో మనవాడి గుర్రు ... లక్కీగా వాడి తల మాత్రం ఆయనకు కనబడడం లేదు. ముందుకు వంగి బల్ల మీద తల పెట్టుకుని గుర్రు కొట్టేస్తున్నాడు."

"హు ఈజ్ గర్గ్లింగ్ ... లుక్ ఔట్ ... హి హేజ్ కంజెశ్చన్ ఇన్ ది లంగ్ !"

"చకచకా గాలరీ మెట్లెక్కి కాలరు వెనకాల పట్టుకుని అవధాని గాడిని కూర్చో పెట్టాడు. మతిపోయినట్టు చూశాడు వెధవాయ్. జేబు లోని స్టెత్ తీసి ధరోగా ఆస్కల్టేట్ చేశాడు. జి. ఎమ్. లెఫ్ట్ లంగ్ లో పెద్ద కేవిటీ ఉందని, మూడు నెలలు ఆస్పత్రిలో ఉండాలని క్లాసు నుంచి తిన్నగా వార్డుకి పంపించేశాడు."

"ఐ పీటీ ది యంగ్ ఫెలో!" అంటూ సింక్ లో చేతులు కడుక్కొని, మళ్ళీ ప్రారంభించాడు లెక్చర్. "ఆకండిషన్ లో మరెందరిని ఇన్ ఫెక్ట్ చేసేవాడో!" ప్రొఫెషనల్ ఎథిక్స్ లోంచి ఫ్రీఫీలింగ్ పెర్సనల్ హేబిట్స్ లోకి వెళ్ళింది. ముందు బెంచీ మీద నోట్ బుక్ మీద చక చక రాసేసుకుంటున్నాడు సాంబుగాడు, మధ్య మధ్య ప్రొఫెసర్ వైపు తల ఎత్తి చూస్తూ. అతిశ్రద్ధగా వింటున్నాడు అనుకున్నాను. ఓ అయిదు నిమిషాలు చూశాక డేగలాగ వచ్చి నోటు బుక్కు అందుకున్నాడు జి. ఎమ్.

"కొన్ని వాక్యాలు చదివాడు, బయటికి, పుస్తకంలో మనవాడు రాస్తున్న కాగితం లోంచి. నువ్వు చెప్పిన మాట నేను నమ్మలేదుస్మీ,

ఆ మాత్రం జాగ్రత్త తీసుకోవా అనుకున్నాను. అధైర్యపడకు. నాన్న గారికి రాసేస్తాను పరీక్షల ముందైతే నేం?"

"కాగితం పుస్తకంలో పెట్టి మడచి ఇచ్చేశాడు. సాంబుగాడు మాత్రం ఉత్తరం ఎవరికి రాస్తున్నాడో తెలుసుకోవాలని పించింది. ముందు బెంచీలో కూర్చున్న అమ్మాయిల ముఖాల్లో పద్మ ముఖం మాత్రం ఎర్రబడిందని ఆ తరువాత చెప్పింది మీనాక్షి. కాని, ఆ ఉత్తరం సాంబుగాడు రాస్తున్నది నర్స్ మార్గరెట్ కని మరి కొన్నాళ్లకు గానీ తెలియలేదు. ప్రొఫెసర్ ఆ రాస్కెల్ పరువు తీసేస్తాడనుకున్నాం. పుస్తకం మడుస్తూ మళ్లీ ప్రొఫెషనల్ ఎథిక్స్ లోనికి వెళ్లాడు. హి హేజ్ ఎ హార్ట్ ఆఫ్ గోల్డ్."

విస్సు ముఖంలోకి చూశాడు కరుణ. రాగానే అతని ముఖంలో కనబడ్డ కారు మబ్బులు కనుమరుగై పోయాయి.

"వెల్ కమ్, యంగ్ మెన్!" బొంగురు పోతున్న గొంతుతో ఆహ్వానించారు మిత్రులిద్దరినీ, ఎమెరిటిస్ ప్రొఫసర్ సూర్యనారాయణ.

పులిలా ఉండే ప్రొఫసర్ పుల్లలా అయిపోయినా, గొంతులోని హుందాతనం మాత్రం చెక్కు చెదరలేదు. వయసుతో బాటు పండిన వ్యక్తిత్వం ఆయనలో పువ్వు మీద తావిలా గుబాళిస్తుంది.

"గుడ్ మార్నింగ్, సర్" చేతులు జోడించారు మిత్రులు.

కరుణ వచ్చిన పని చెప్పాడు జి.ఎమ్.కి చేత్తోనే సైగచేసి ఓ గది లోకి తీసుకెళ్లాడు ప్రొఫసర్ ఇద్దరినీ.

"బి. పి. కట్టు." నర్సుని ఆజ్ఞాపించినట్టు ఆజ్ఞాపించాడు కరుణని. ఎయిర్ పంపు చేసి, స్టెత్ వెయిన్ మీద పెట్టి మెర్క్యూరీ కాలం వేపు చూశాడు.

"పెద్ద విశేషం లేదబ్బాయ్. ఈ రోజుల్లో, అందులోనూ నీ అంత కష్టపడి ప్రాక్టీసు చేస్తున్న జి.పి.కి ఇది నార్మలే!"

"ఇంటి దగ్గర చూసుకున్నాను ..."

"ఆల్‌రైట్, లైడౌన ... బనియన్ కూడా ... నో మైడియర్ ఫెలో, నో మర్మర్స్ ఎటాల్ ... నథింగ్ పెక్యూలియర్... ఐయాష్యూర్ యూ! కరుణాకర్‌రావ్! నువ్వు చూడు (మరో స్టెత్ అందించాడు) హియర్, హియర్, హియర్ ... ఐథింగ్ ఇట్ ఈజ్ ఓకే ... లుక్ మైడియర్ ఫెలో, ఎందుకలా భయపడిపోతున్నావ్. కార్డియాక్ కాన్షస్ అయిపోతున్నావ్. ఇన్నాళ్లై ప్రాక్టీసు చేస్తున్నావ్ – బెంగపెట్టుకుని ఏ పేషెంటైనా, ఎప్పుడైనా, ఏమైనా సాధించాడా?"

గొంతు పూడుకున్నట్టయింది. కాసేపు ఆగిపోయాడు జి. ఎమ్. స్టెతస్కోపు మడచి జేబులో పెట్టుకున్నాడు.

గొంతు సవరించుకోవడానికి ప్రయత్నం చేసిమరీ వెలుగు రాసిన గొంతులో మళ్లీ ప్రారంభించాడు.

"దయానిధి కేస్ హిస్టరీ మీకు చెప్పానా? ఆ అన్నట్టు లేదు. 1953లో జరిగింది. అప్పటి నించి ప్రతి బ్యాచి వాళ్లకీ చెబుతున్నాను. ఈ కేసు విషయం ... రిమూవ్ ఇట్ దేర్!"

పరాకుగా కరుణాకరం డాక్టరుగారిచ్చిన స్టెతస్కోపు మెడలో వేసుకోబోతున్నాడు. గర్జన విన్న తరువాత జ్ఞాపకం వచ్చింది, మెడలో స్టెత్ వేసుకునే అలవాటు అయనకు ఏవగింపని.

"సారీ, సర్!"

"ఫర్ గెట్ ఇట్."

మళ్లీ ఊపిరి కోసం కొంచెం సేపు ఆగారు. కొద్దిగా ఆయాస పడుతున్నట్టనిపించింది కరుణకి జి ఎమ్.ను చూస్తుంటే

"ఏం చెబుతున్నానూ – దయానిధి .. వెరీ ఇంటరెస్టింగ్ ... అతని పేరు మీరూ వినే ఉంటారు. ఏన్ అథారిటీ ఇన్ ఫిజిక్స్ నాదగ్గరికొచ్చే సరికి అతని వయస్సు ఏభై అయిదు. మద్రాసు క్రిస్టియన్ హాస్పటల్లో కార్డియాలజీ యూనిట్‌కు వెళ్లాడట ఇన్‌వెస్ట్‌గేషన్స్ అన్నీ

చేయించు కున్నాడట. కార్డియాలజిస్టు లందరూ చూశారుట. మూడు నెల లిచ్చాడట చీఫ్. ఆ తరువాత నా పేరెవరో చెప్పారట, నా దగ్గరకు వచ్చాడు ప్రాణం అంటే తీపి - ఐ కెన్ అండర్ స్టాండ్ (ఆయాస పడు తున్నారు ప్రొఫెసర్ గారు).”

“ఆయాసపడుతూ వచ్చాడు భావనగర్ వార్డులోకి డి.యమ్.ఒ. తీసుకొచ్చాడు నాదగ్గరకు. బి. పి. కట్టమన్నాను. మెర్క్యూరీ కాలమ్ చూసి అసిస్టెంట్లే గుడ్లు తేలేసేటట్లు కనబడ్డారు. నార్మల్ గా లెవెల్ కు బి. పి. పోతే హేమరేజ్ వచ్చి తీరుతుందనుకుంటాం. బి. పి. ఎంతుందో తెలుసా? 280/160.”

“బి. పి. విప్పెయ్య మన్నాను.”

“డి.యమ్.ఓ. కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. ఆశగా చూస్తున్నాడు పూర్ ఫెలో, ఫిజిక్స్ ప్రొఫెసర్ కి డి. యమ్. ఓ. సిగరెట్ ఆఫర్ చేసాడు. కార్డియాలజిస్టు మద్రాసులో చెప్పాడట, రెండు రోజులకోటి కాస్త తేలికగా కాల్చుకోమని. ఆ క్రిందటి దినమే ఒకటి కాల్చాడట. మరేం భయం లేదు, కాల్చుకో మన్నారు. ఆత్రంగా దమ్ము లాగాడు. ఉపవాసం ఉన్న మీదట ఆవురావురుమని తింటే పలకమారినట్టు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.”

“టేకిట్ ఈజీ ... రంగారావ్! గెట్ మీది జర్నల్ ఆఫ్ కార్డియాలజీ వాల్యూమ్ ట్వెన్టీఫైవ్, నంబర్ సిక్స్టీన్! కేకేశాను అసిస్టెంటుకి. గబ గబ జర్నల్ రిఫర్ చేసి ఇచ్చేశాను.”

“చూడండి, దయానిధిగారూ, ఆబ్జెక్టివ్ గా ఉండడం శాస్త్రజ్ఞులకు అత్యవసరమని గర్వంగా చెప్పుకుంటాం. ఇన్వెస్టిగేషన్స్ చేయించారు. కొంతమటకు ఇంటర్ప్రిటేషన్స్ మీకు తెలిసే ఉంటాయి. కాని, ఓ విషయం - మీజీవన వేగాన్ని బట్టి చూస్తే మీరింకా ఇలా తిరగడం మీ అదృష్టం. ఇప్పుడే ఓ కేసు జ్ఞాపకం వచ్చి రిఫర్ చేశా, చూస్తారా?” అని అడిగారు.

"ఎందుకండీ? చెప్పండి" అన్నాడు.

"దయానిధిగారూ! నిజం చెప్పాలంటే మీ హార్ట్ మజిల్ కాదు, ఉక్కు. లేకపోతే ఇంతగా పనిచెయ్యగలడం ఆశ్చర్యం. రంగారావ్! టేక్ ది రీడింగ్స్. రికార్డ్ దెమ్ .. ఎవండర్ ఫుల్ కేస్ ... మీ కేసు కార్డియాలజీ జర్నల్‌లో నేనిప్పుడు రిఫర్ చేసిన దాని కంటె వండర్ ఫుల్. అలా రంగారావ్ గదిలోకి వెళ్లి కేస్ హిస్టరీ పూర్తిగా చెప్పండి. మద్రాసు ఆస్పత్రిలో వాళ్లు చేసిన ఇన్ వెస్టిగేషన్స్ రిజల్ట్స్, కాగితాలు తెచ్చారు కదా? అవన్నీ ఇవ్వండి.

"మాత్రలు ఇస్తాను. పదిహేను రోజులు వాడండి. తరువాత — ముఖ్య విషయం — ఫర్ గెట్ ఎవెరిథింగ్ ఎబౌట్ యువర్ హార్ట్ ... ఎనిమిది వారాలపాటు రోజుకు మూడు గ్లాసుల పళ్లరసం, రెండు పూటలా కప్పు మజ్జిగ అన్నం తినండి, గోటు భీమిలి, ఎకామ్ ప్లేస్. మీ ఎడ్రెస్ ఎవరికీ తెలియనివ్వకండి. మీ భార్యనూ తీసుకెళ్లండి మీతో — టేక్ కంప్లీట్ రెస్ట్. నాలుగు వారాల తరువాత నాదగ్గరకు మళ్లీ రండి. మాత్రలు వేసుకోవడం మరచిపోకండి." లేబిల్ తీసేసిన తెల్లసీసాలో మాత్రలు వేసి ఇచ్చాను. కోటు జేబులో వేసుకుని వెళ్లిపోయాడు.

"ప్రతి రోజూ ఆబిట్యుయరీ కాలమ్ చూసే వాడిని. కాని, నే చెప్పిన ప్రకారం నాలుగు వారాల తరువాత ఓ చెక్కు పట్టుకుని వచ్చాడు, ఓ వెయ్యి రూపాయలకి. ఇదిగో ఆ చెక్కు. (టేబిల్ మీద గ్లాసు కింద చెక్కు చూపించాడు జి.ఎమ్.)

"అంతే ఆ తరువాత నాకు తెలియదు ప్రొఫెసర్ దయానిధి ఏమయ్యాడో ... ఆమధ్య ప్లేన్ క్రాష్ అవలేదూ? మోహన్ కుమార మంగళంతో పాటు ఈయన ఈ విమానంతో కూలపోయాడని తరువాత పత్రికలో చూశాను". ముగించారు ప్రొఫెసర్ గారు.

"మీ రిచ్చిన టేబ్లెట్స్ .. ?" కరుణాకరం అడిగాడు ఆతృతగా.

"అదే రహస్యం. యు కెన్ ఇన్ ఫర్, ఐ వోంట్ రివీల్ ది సీక్రెట్. ఇట్ విల్ డై విత్ మి."

గొంతులోంచి మాట రావడం కష్టమవుతోంది ఆయనకి. కొంత సేపు పెనుగులాడి వెలుగురాసి పోయిన గొంతుతో సలహా ఇచ్చారు. "యంగ్ మాన్! ఫర్ గెట్ ఎబౌట్ యువర్ హార్ట్. మూడు నెలల తరువాత మరో మనిషి వవుతావ్. ఎనదర్ థింగ్. మీరిద్దరూ ఈ వేళ నాతో భోజనం చెయ్యాలి. మల్లిక వెయిట్ చేస్తూ ఉంటుంది. పదండి, లోపలకు." పండు ముత్తైదువు మల్లికమ్మగారు ఇద్దరినీ పోల్చారు, ఆహ్వానించారు. పిల్లల గురించీ, వాళ్ల చదువుల గురించీ ప్రశ్నలు వేస్తున్నారు ఓ కంట ప్రొఫసర్ గారిని కనిపెడతూనే. బట్టలు మార్చుకు రావడానికి ప్రొఫసర్ గారు మేడ మీదకి వెళ్లారు.

"ఎంత పెద్ద వాళ్లయారూ! మొన్న మొన్నలా ఉంది. హాస్టల్‌లో ఉండేవారు కదూ? నాకు బాగా జ్ఞాపకం ఉంది. మీవాళ్లు బాగున్నారా- పేరంటానికి వస్తుంటారు, తరచూ కలుస్తూనే ఉంటాం. నీ కెంతమంది పిల్లలు, బాబూ? ఏ ఊళ్లో ఉంటున్నావ్?" విశ్వనాథరావు వైపు తిరిగి అడిగారు.

"ఇద్దరూ మగపిల్లలే, సంకిలి."

"చూడండి, బాబూ, మీ ప్రొఫసర్ గారు ఆరోగ్యంగానే ఉన్నారంటారా? నేచెబితే వినిపించుకోరు. అంతా నవ్వులాట కింద తోసేస్తారు. గొంతు పట్టేసి రెండు నెలలౌతుంది .. ఆయాసం కూడా ... మీరైనా చొరవ చేసుకుని ..."

మిత్రులు ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు. కరుణ ప్రారంభించాడు.

"బాబోయ్, ఆయనకు మనం చెప్పడమా, ఏ చిన్న విషయంలో జాప్యం చేసినా మమ్మల్ని తిట్టేసేవారు, అలాంటిది ..." వాక్యం మధ్యలో ఆపేశాడు.

"సారీ, డియర్, ఆలస్యం అయింది, వడ్డించేయ్"

అతిథులిద్దరికీ వడ్డించి ప్రొఫసర్‌గారికి మాత్రం గ్లాసుతో జావ అందించింది. "ఏదో థ్రోట్ ట్రబుల్, కొన్నాళ్ళపాటు లిక్విడ్ డయిట్... మీరు కానివ్వండి."

కరుణాకరరావుకి ఆయన నోరు విప్పి గొంతు పరీక్ష చెయ్యాలని పించింది. విశ్వనాథరావుకి ఆయన ఛెస్ట్ ఎగ్జామిన్ చెయ్యాలనిపించింది. గబగబా భోజనాలు ముగించారు. ప్రొఫసర్‌గారి ఒంట్లో జబ్బేమైనా ఉందా, కేవలం సెనిలిటీ ఏనా అనే ఆలోచనతో ఇళ్ళకు వెళ్లారు.

మూడవ రోజు కరుణాకరణం వద్ద నుండి విశ్వనాథరావుకి ఉత్తరం వచ్చింది.

మైడియర్ విశ్వా,

విభ్రాంతికరమైన వార్త. ప్రొఫసర్ సూర్యనారాయణరావుగారు, ది గ్రేట్ మాన్ నిన్న సాయంకాలం దివంగతులైయ్యారు. నేను కాన్సర్ సస్పెక్ట్ చేశాను–కాదు, ఎ ఫేటల్ స్ట్రోక్ ఆఫ్ ఏంజైనా. కొద్ది సెకండ్లల్లో మృత్యువు ఆయన గాంభీర్యాన్ని జయించి వేసింది. భార్య మల్లికమ్మగారి దుఃఖం మనం ఊహించ లేం.

సంవత్సరంగా ఆమె పోరుపెడుతూనే ఉన్నదట. ఆయన చెవిని పెట్టుకోలేదు. మరో విషయం – ఆయన చూసిన చివరి కేస్ నీదే–అది కేసనుకుంటే.

ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. "డోన్ట్ మిస్ థర్స్‌డే" అన్నారు నాతో. రాంచీలో ఉన్న అమ్మాయికీ, ఢిల్లీలో ఉన్న అబ్బాయికీ మొన్న శుక్రవారం నాటికి రమ్మని ఉత్తరాలు వ్రాశారట.

మల్లికమ్మగారి దగ్గర కూర్చుని, చుట్టూ పిల్లలతో చిరునవ్వులు కురిపిస్తూ కడ ఊపిరి తీసుకున్నారట.

అద్భుతమైన విషయం - ఆయన తన చరమ ఘట్టాన్ని అంత ఖచ్చితంగా అంచనా వేసుకోగలగడం.

ఓ విశిష్టమైన వ్యక్తిని కోల్పోయాం.

మే హిస్ సోల్ రెస్ట్ ఇన్ పీస్.

కరుణ

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక – 12-2-75